ప్రమాదాల మలుపులు

- రోడ్ల మూల మలుపుల వద్ద జాగ్రత్త చర్యలేవీ?
- స్పీడ్ బ్రేకర్లు, సూచికలు లేని వైనం
- పట్టించుకోని ఆర్అండ్బీ అధికారులు



వేమూరు పోలీసు స్టేషన్ వద్ద ప్రమాదకర మలుపు



వేమూరు విద్యుత్ కార్యాలయం వద్ద..



జంపని సెంటరులో..

వేమూరు: మండలంలో ప్రధాన రహదారుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి పలువురు క్షతగాత్రులు కాక, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం జరిగాయి.

ప్రమాదాలకు నిలయం..

రెండేళ్ల క్రితం జంపని చెరువు మూల మలుపు వద్ద వ్యాను బోల్తా పడి కృష్ణా జిల్లాకు చెందిన ఐదుగురు అయ్యప్పలు మృతిచెందారు. ఆ ఘటన తర్వాత మేల్కొన్న ఆర్అండ్బీ అధికారులు మలుపు వద్ద స్పీడ్ బ్రేకరు ఏర్పాటు చేశారు ■ అదేవిధంగా వేమూరు పోలీసు స్టేషన్ వద్ద, విద్యుత్ కార్యాలయం వద్ద, జంపని సెంటరులో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆయాచోట్ల స్పీడ్ బ్రేకర్లు గానీ, ప్రమాద సూచికలు గానీ ఏర్పాటు చేయలేదు. ఆయా ప్రాంతాల్లో అనేకసార్లు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలయ్యారని స్థానికులు వాపోతున్నారు. పెద్ద ప్రమాదాలు జరక్కముందే ఆర్అండ్బీ అధికారులు మేల్కొని మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచికలు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



వేమూరు విద్యుత్ కార్యాలయం వద్ద మలుపు చాల ప్రమాదకరమైనది. ఈ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. అక్కడ అనేకసార్లు చిన్నచిన్న ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్ద ప్రమాదం జరక్కముందే అధికారులు మేల్కొని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– గుమ్మడి దానియేలు, వేమూరు

జంపని సెంటరులో ప్రమాదకరంగా..



జంపని సెంటరు వద్ద ఉన్న మలుపు చాలా ప్రమాదకరంగా ఉంది. తెనాలి నుంచి కొల్లూరు వెళ్లే మలుపు, కొల్లూరు నుంచి తెనాలి వెళ్లే మలుపు రెండు మలుపులు జంపని వద్ద కలుస్తున్నాయి. అందువల్ల ఈ మలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చెరువు వద్ద మాత్రమే స్పీడ్ బ్రేకర్ ఉంది. ఆర్అండ్బీ అధికారులు సత్వరం స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– అల్లూరు యోనా, జంపని

క్లుప్తంగా

నేడు కోనేటిపురంలో గ్రామ సభ

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో రీ సర్వే కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సభకు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొని తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని తెలిపారు.

చేనేత కార్మికులకు బోనస్‌లు పంపిణీ



రేపల్లె రూరల్: ఇసుకపల్లి చేనేత సహకార సంఘంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.2.02లక్షల నికర లాభాలు వచ్చిన సందర్భంగా సంఘంలోని సభ్యులకు బోనస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు 120 మంది సభ్యులకు రూ.98,833లను చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.నాగమల్లేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ దివి రాంబాబు, సొసైటీ మేనేజర్ కొతరపు శోభన్‌బాబు, చేనేత నాయకులు కొతరపు వెంకట నాంచారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.వీరశంకర్, ఇసుకపల్లి పాలకేంద్రం అధ్యక్షుడు ముత్తవరపు స్వతంత్ర తేజ్‌కుమార్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో 'ఏబీఆర్' విద్యార్థి ప్రతిభ



రేపల్లెరూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యువజనోత్సవాలలో రేపల్లె పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.ప్రిన్స్ ప్రతిభ కనపరిచాడు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రిన్స్ వకృత్వ పోటీలలో యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయస్థానం సాధించటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని బహుమతులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలవాలని కోరారు. అభినందించిన వారిలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎం.దాసు, అధ్యాపకులు భీమయ్య, సంపూర్ణ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించండి

తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. గానుగ నూనె షాపు నుంచి దుర్వాసన వస్తుందని ఒకరు, మా స్థలంలో మురుగు నీరు నిల్వకుండా చూడాలని మరొకరు ఇలా నాలుగు అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. వీటిని పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిలో ముగిసిన మహిమ పండుగలు

తెనాలి: స్థానిక ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చ్ లో ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో జరిగిన మహాదేవుని మహిమ పండుగలు ఆదివారం రాత్రితో ముగిశాయి. మహాదేవుడైన ఏసుక్రీస్తు మార్గంలోకి రావడం ద్వారా హృదయాల్లో శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని పలువురు దైవ సేవకులు చెప్పారు. కన్వీనర్ బ్రదర్ ఆనందన్న పర్యవేక్షణలో జరిగిన ఈ పండుగల్లో రెవరెండ్ పల్లె శామ్యూల్, రెవరెండ్ ఎస్.చిట్టిబాబు, పాస్టర్ ఎం.సంసోను, పాస్టర్ జి.దానియేలు రాజు, పాస్టర్ దాసరి ప్రభుదాస్, ఎ.బోయజు, జి.ఐజక్ కుమార్, బ్రదర్ పి.ఛార్లెస్ వెస్లీ వాక్యోపదేశం చేశారు. పి.ప్రశాంత్ బాబు స్తుతి ఆరాధన క్రమం చేశారు. వాక్యోపదేశం చేసిన దైవ జనులను బ్రదర్ అనందన్న సత్కరించారు.

తెనాలి ఏసీపీగా శివన్నారాయణ

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ సీటీ ప్లానర్‌గా టి.శివన్నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీఆర్‌డీఏ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో తెనాలిలో ఏసీపీలుగా పనిచేసిన సుధాకర్ ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు, సుబ్బారావు సీఆర్‌డీఏకు బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీ.ఎం.లక్ష్మీపతిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వేమూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ శివన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ యల్లమాటి మోహనరావు అధ్యక్షత వహిస్తారని ఆయన తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సర్వ సభ్య సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

దిన పత్రికలు అందుబాటులో ఉంచాలి



కర్లపాలెం: పాఠకులకు దినపత్రికలు, కాంపిటేషన్ బుక్స్, మాసపత్రికలు అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెం శాఖా గ్రంథాలయాన్ని సోమవారం ఎంపీడీఓ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు అందుబాటులో ఉన్న వార పత్రికలు, పుస్తకాల వివరాలను శాఖా గ్రంథాలయాధికారి రమణమ్మను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాల ఉపయోగాలను యువతకు, విద్యార్థులకు వివరించి వారు గ్రంథాలయాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. పుస్తకాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.

పందులను రహదారులపై వదిలితే చర్యలు

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



పందుల యజమానులకు సూచనలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

రేపల్లె రూరల్: మూగజీవాలైన గోవులు, కుక్కలు, పందులు రహదారులపైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం పట్టణంలోని పందుల యజమానులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధాన రహదారులలో ఒక్కసారిగా పందులు వాహనాలకు అడ్డురావటంతో ఇటు పందులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఉన్నాయని, అదేవిధంగా వాహన చోదకులు సైతం ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. పట్టణంలో, నివాస గృహాల మధ్యలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ పారిశుద్ధ్యానికి సైతం విఘాతం కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా నిర్వాహకులు తమ పందులను నిర్ణీత ప్రదేశాలలో మాత్రమే వదులుకోవాలని, అక్కడ మాత్రమే పోషణ చేసుకోవాలని చెప్పారు. రహదారులపైకి వదిలేస్తే ప్రత్యేక సిబ్బంది ద్వారా వీటిని ఇతర ప్రాంతాలకు తరలించటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పందుల నిర్వహణపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు పందుల యజమానులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి పాటుపడాలి



వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న బాపట్ల డీఆర్‌సీ ఏడీఏ హుస్సేన్

కొల్లూరు: రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పాటుపడాలని బాపట్ల డీఆర్‌సీ ఏడీఏ హుస్సేన్ అన్నారు. సోమవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందికి వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రతిరోజు రైతులతో మమేకవుతూ, వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి పంటలలో ఉన్న చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను నిరంతరం పరిశీలించడం ద్వారా పంటకు వ్యాపించే తెగుళ్లను ఆదిలోనే గుర్తించి నివారించడం ద్వారా వ్యవసాయదారులకు పెట్టుబడుల భారాన్ని తగ్గించడానికి అవకాశాలు మెరుగవుతాయని సూచించారు. రేపల్లె ఏడీఏ విజయబాబు, డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ బాలమురళీనాయక్ పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



అవగాహన కల్పిస్తున్న సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: దోమలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియాశాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్, సుందరయ్యనగర్, చెంచుపేటలో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల వివరాలు నమోదు చేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో చూపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికార దారవత్ రాజునాయక్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, తెనాలి పట్టణ, మండల సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, శివ గణేష్, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బడుగు వర్గాల విద్యాదాత పొన్నెకంటి మృదుభాషిణి

సంస్మరణ సభలో మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నివాళి



మృదుభాషిణి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన మందకృష్ణమాదిగ

తెనాలి: అట్టడుగు వర్గాల్లో విద్యావ్యాప్తికి ఎంతగానో కృషిచేసిన మంచి మనిషి పొన్నెకంటి మృదుభాషిణి చిరస్మరణీయులని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఇటీవల మృతిచెందిన కరుణానిలయం విద్యాసంస్థల కరస్పాండెంట్ పొన్నెకంటి మృదుభాషిణి సంస్మరణ సభను సోమవారం అదే సంస్థ ఆవరణలో నిర్వహించారు. డీఎం లూథర్‌బాబు అధ్యక్షత వహించారు. మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఓర్పు, నేర్పు, సహనానికి మారుపేరుగా, ప్రధానోపాధ్యాయినిగా మృదుభాషిణి ఎంతో పేరుప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కరుణానిలయం కరస్పాండెంట్‌గా, ప్రధానోపాధ్యాయినిగా ఎందరికో విద్యను అందించారని గుర్తుచేసుకున్నారు. ఆమె భర్త పొన్నెకంటి నథానియెల్ ప్రేమచా గ్రామసర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతగానో శ్రమించినట్టు చెప్పారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కుటుంబసభ్యులు పొన్నెకంటి మంజుల, పీబీ కరుణాకర్, పొన్నెకంటి ప్రత్యూష్, డాక్టర్ ప్రభావతి, పి.సుధీర్‌కుమార్ తమ ప్రసంగాల్లో మృదుభాషిణి ఉన్నత వ్యక్తిత్వాన్ని, విద్యాసంస్థల అభివృద్ధికి చేసిన శ్రమను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.లక్ష్మీసామ్రాజ్యం, జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ శోభామంజరి, డాక్టర్ పద్మావతి, మాజీ సర్పంచ్ వల్లూరి వరప్రసాదరావు, వై.రవికిరణ్, ఎ.సుదీప్, సందీప్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

రేపల్లె రూరల్: సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు అర్జీలు అందినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. రద్దీగా ఉండే పద్మావతి సెంటర్‌లో రిక్వెస్ట్‌స్టాప్‌కు బదులుగా అన్నా క్యాంటీన్ వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అర్జీ అందించారన్నారు. అదేవిధంగా అడంగల్ సమస్యపై 1, ఇంటి పన్నులో పేరు మార్పుకై 1, పట్టాదారు పాసు పుస్తకాలకై 1, రిజిస్టర్ ఆఫ్ రైట్స్‌లో రెక్టిఫికేషన్‌కై 2 అర్జీలు అందాయన్నారు. వీటిని పరిశీలించి ఆయాశాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునని పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు జాబ్‌మేళా

వేమూరు: వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పి.ప్రణయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు, ఎస్ఆర్ఎం గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, సెల్ ఏక్ట్ మొబైల్, సోర్స్ కంపెనీలు హాజరవుతున్నాయని ఆయన తెలిపారు. 100కు పైగా ఖాళీలు ఉన్నాయని తెలియజేశారు. విద్యార్హతను బట్టి జీతం ఉంటుందని ఆయన తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు బయోడేటా, తమ పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా సర్టిఫికెట్ల జిరాక్సులు, ఆధార్ కార్డు తేవాలన్నారు.

మెరుగైన సేవలే యూనియన్ బ్యాంకు లక్ష్యం



బాపట్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటమే యూనియన్ బ్యాంకు లక్ష్యమని బ్యాంకు మేనేజర్ టి.కమలాకరరావు పేర్కొన్నారు. బ్యాంకులో సోమవారం విజిలెన్సు అవగాహన కార్యక్రమం జరిగింది. ఉద్యోగులతో ప్రమాణం చేపట్టారు. ఈసందర్భంగా కమలాకరావు మాట్లాడుతూ ఆర్థికపరమైన వ్యవహారాల్లో బ్యాంకు ఉద్యోగులు క్రమశిక్షణ ఉండటం, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో బ్యాంకు అధికారులు టి.శేషసాయి, టి.తిరుపతమ్మ, జె.సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

సిస్టర్ నివేదిత సేవలు చిరస్మరణీయం



ఐలవరంలో సిస్టర్ నివేదిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు

ఐలవరం(భట్టిప్రోలు): స్వామి వివేకానందుని బోధనలకు ప్రభావితమై క్రైస్తవ మతం నుంచి హిందూ ధర్మాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత (మార్గరేట్ ఎలిజబెత్ నోబుల్) చరిత్ర సృష్టించారని సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. సోమవారం భట్టిప్రోలు మండలం ఐలవరంలో సిస్టర్ నివేదిత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమశంకరరావు మాట్లాడుతూ సిస్టర్ నివేదిత అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కోల్‌కత్తా మురికివాడల్లో ప్లేగు వ్యాధి సోకినప్పుడు ఆమె తన శిష్యబృందాలతో ఎంతో సేవచేసి పరిశుభ్రత నేర్పించారన్నారు. అంతేకాక బ్రిటిష్ రాక్షస పాలనను చీల్చి చెండాడుతూ అనేక పత్రికలలో వ్యాసాలు రాసి ఆంగ్లేయుల బానిసత్వపు కోరల నుంచి విముక్తి కల్పించటానికి కృషి చేశారన్నారు. కోల్‌కత్తాలో 1898లో బాగ్ బజార్‌లో బాలికలకు విద్య అవసరమని గుర్తించి మహిళా పాఠశాలను స్థాపించి వందేమాతర గీతాన్ని ప్రార్థనా గీతంగా మార్చి స్వాతంత్ర్యం కోసం పాటు పడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తొలుత సిస్టర్ నివేదిత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు కొసనం వాణి, కొతరపు సుబ్రహ్మణ్య ప్రసాద్, సంగాబత్తుని వెంకటేశ్వర్లు, అవ్వారు నారాయణరావు, కొతరపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఈకేవైసీ చేయించాలి



సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శేషుకుమారి

కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని బ్లాక్ కో–ఆర్డినేటర్ బి.రత్నకిరీటీ తెలిపారు. సోమవారం కర్లపాలెం మండలంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషుకుమారి ఆధ్వర్యంలో గణపవరంలో నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో కర్లపాలెంలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశంలో బ్లాక్ కో–ఆర్డినేటర్ రత్నకిరీటీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణుల, బాలింతల వివరాలను ఫేస్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. సూపర్‌వైజర్లు శేషుకుమారి, నాగమల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేయటంతో పాటు రికార్డులలో నమోదు చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు, సెక్టార్ సమావేశంలో బ్లాక్ కో–ఆర్డినేటర్ బి.రత్నకిరీటీ పాల్గొని చిన్నారులకు ఈకేవైసీ చేయించాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి, కార్యకర్తలు ఉన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పట్టణ, మండల పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని రేషన్ పంపిణీపై డీలర్లకు, యండీయూలకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రతినెలా 1వ తేదీ నుండి 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. చిన్నచిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల నిర్వాహకులు తమకు అందించిన సరుకులను ఖచ్చితంగా పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. ఇటీవల ఓ ఆపరేటర్ పోలీసులకు రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాను స్వయంగా రేషన్ పంపిణీని పరిశీలిస్తానని చెప్పారు. పట్టణ, మండల పరిధిలోని ఎండియు ఆపరేటర్లు సీఎస్‌డీటీ మూర్తి పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలతో టపాసులు విక్రయం

కొల్లిపర: దీపావళి పండుగ సందర్భంగా భద్రతా ప్రమాణాలు పాటిస్తూ టపాసులు విక్రయించాలని తహసీల్దారు జి.సిద్ధార్థ ఆదేశించారు. సోమవారం రెవిన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టపాసుల విక్రయానికి మండలంలో మొత్తం 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటి పరిశీలించటం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా అర్జీదారులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని నిర్వాహకులకు హెచ్చరించారు. అనుమతులు పొందిన వారు కేటాయించిన ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించాలని సూచించారు. నిర్వాకులు నీరు, ఇసుక తదితర అగ్నిమాపక సామాగ్రిని దుకాణాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొల్లిపర మండల ఎస్ఐ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అక్రమంగా మందుగుండు సామగ్రి కలిగి ఉన్నా, తయారు చేసినా అనధికారి ప్రదేశాలల్లో నిల్వ చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలల్లోని ప్రజలు ఎక్కడైనా టపాసుల అక్రమ నిల్వలు, విక్రయాలపై డయల్ 100 , 112 ద్వారా సమాచారం అందించాలని సూచించారు.